సాక్షి
పార్వతీపురం మన్యం
బుధవారం । 22 । మార్చి । 2023



జలమే జీవనాధారం

సమస్త ప్రాణికోటికి జలమే జీవనాధారం. అటువంటి జలవనరును పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉంది. - 4లో



ప్రణాళికాబద్ధంగా దర్యాప్తు

దర్యాప్తులో ఉన్న చీటింగ్ కేసులను ప్రత్యేకంగా సమీక్షించి, చీటింగ్ కేసుల్లో దర్యాప్తును ప్రణాళికాబద్ధంగా, త్వరితగతిన పూర్తిచేయాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. - 4లో

వర్ష సూచన



గుమ్మలక్ష్మీపురం: రాగల ఐదు రోజుల్లో ఆకాశం మేఘావృతమై పార్వతీపురం, విజయనగరం ఉమ్మడి జిల్లాలో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని రస్తాకుంటుబాయి కృషివిజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త కె.భావన, అగ్రి మేట్ అబ్జర్వర్ ఎస్.రవళి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాగిజావ



రాగిజావ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్నగోరుముద్దలో రాగిజావను చేర్చింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో వర్చువల్ విధానంలో రాగిజావ పంపిణీని మంగళవారం ప్రారంభించారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ కలెక్టర్ కార్యాలయం నుంచి సీఎం ప్రసంగాన్ని తిలకించారు. అనంతరం జిల్లా విద్యార్థులకు రాగిజావను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1298 ప్రాథమిక పాఠశాలలో 33,699 మంది విద్యార్థులు, 95 ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 8,134మంది విద్యార్థులు, 102 ఉన్నత పాఠశాలల్లోని 29,446 మంది విద్యార్థులు వెరసి 1495 పాఠశాలల్లో 71,279 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. వీరికి 20 గ్రాముల రాగిపిండి, 10 గ్రాముల బెల్లం, 150 ఎంఎల్ నీటితో చేసిన రాగిజావతో ప్రోటీన్‌లు, కార్బోహైడ్రేట్లు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం అందుతుందన్నారు. రాగిజావ చక్కని పోషకాహారంగా పేర్కొన్నారు. విద్యార్థులు పౌష్టికాహాకరం తీసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో డీఈఓ ఎస్‌డీవీ రమణ, డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మాజీరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలమాంబకు పూజలు



శంబరపోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి తొమ్మిదో జాతర మంగళవారం వైభవంగా సాగింది. చదురుగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని, వనంగుడిలోని పెదపోలమాంబ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వెనుకన ఉన్న వేపచెట్టుకు పూజలు చేశారు. ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ, ట్రస్ట్‌బోర్డుచైర్మన్ పూడి దాలినాయుడు, కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

విద్యార్థుల ఆలోచనలకు ప్రతిరూపం శాస్త్రీయ ప్రదర్శన

- జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీవీ రమణ



ప్రాజెక్టు వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీఈఓ ఎస్‌డీవీ రమణ

పార్వతీపురంటౌన్: విద్యార్థుల అద్భుత ఆలోచనలకు ప్రతిరూపం శాస్త్రీయ ప్రదర్శన అని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీవీ రమణ అన్నారు. వ్యవస్థాపక మానవత్వ అభివృద్ధి జిల్లాస్థాయి కార్యక్రమాన్ని స్థానిక డీఈఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టుల పనితీరును అడిగితెలుసుకున్నారు. విద్యార్థుల ఆలోచనలతో రూపొందించిన ప్రాజెక్టులు పారిశ్రామికాభివృద్ధికి దోహదపడతాయన్నారు. జిల్లాలో 140 పాఠశాలల నుంచి 140 ప్రాజెక్టులు అందగా, వివిధ స్థాయిల్లో ఉత్తమంగా నిలిచిన 10 ప్రాజెక్టులను ప్రదర్శించారు. మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన ప్రాజెక్టులను ఈనెల 28న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని డీఈఓ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓతో పాటు జిల్లా అకాడమిక్ మోనటరింగ్ అధికారి రాజేశ్వరి, డీసీబీ సెక్రటరీ సీహెచ్ శ్రీనివాసరావు, ఈఎండీపీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనూష, జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

జంఝావతి రబ్బర్ డ్యామ్‌ను సందర్శించిన డీజీ



రబ్బర్ డ్యామ్‌వద్ద స్థానికులతో డీజీ

కొమరాడ: మండలంలోని రాజ్యలక్ష్మీపురం సమీపంలో జంఝావతి నదిపై నిర్మించిన రబ్బర్ డ్యామ్‌ను అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ మంగళవారం సందర్శించారు. ఆయకట్టు వివరాలపై ఆరా తీశారు.

శోభకృత్‌కు స్వాగతం



గరుగుబిల్లిలో కొత్తనాగళ్లకు పూజచేయిస్తున్న రైతులు



బలిజిపేట: మిర్తివలసలో పంచాంగశ్రవణం చేస్తున్న వేదపండితుడు



గరుగుబిల్లి: ఉగాదికి స్వాగతం పలుకుతూ నాగూరుకు చెందిన నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు వేసిన వర్ణచిత్రం

ప్రతి ఇంటిగుమ్మానికి మామిడి తోరణాలు.. ఊరూరా పంచాంగ శ్రవణాలు.. షడ్రుచుల పచ్చడికి కావాల్సిన సామగ్రి సేకరణ.. ఏరువాకకు నాగళ్లను సిద్ధం చేయడంలో నిమగ్నమైన రైతన్నలు... ఇలా ఏ ఇంట చూసినా మంగళవారం తెలుగు సంవత్సరాది ముందస్తు సందడి కనిపించింది. శోభకృత్‌నామ సంవత్సరాదికి స్వాగతం పలికేందుకు పల్లెలు, పట్టణాలు ముస్తాబయ్యాయి.

– బలిజిపేట/గరుగుబిల్లి

రూ.2 కోట్లతో అదనపు తరగతి గదులు



ఉన్నతపాఠశాలకు అదనపు తరగతి గదులు నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హైవే బృందం

మెంటాడ: హరిత జాతీయ రహదారి నిర్మాణంలో మెంటాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలను తొలగించనున్నారు. ఆ స్థానంలో రూ.2కోట్ల వ్యయంతో ఎకరన్నర స్థలంలో 12 తరగతి గదులు, సైకిల్‌స్టాండ్, మరుగుదొడ్లు, డైనింగ్‌హాల్‌ను కొత్తగా నిర్మిస్తామని హైవే అథారిటీ ఇంజినీర్ రోహిత్ కుమార్ తెలిపారు. పాఠశాల భవనాలను మంగళవారం పరిశీలించారు. కొత్త భవనాలు నిర్మించనున్న స్థలాన్ని సర్వే చేయించారు. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు హైవే అధికారులకు పూర్తి వివరాలను అందించారు.

సమృద్ధిగా తాగునీరు..!

- వందేళ్ల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా పనులు
- రూ.68.98 కోట్ల వ్యయంతో సాలూరులో తాగు నీటి ప్రాజెక్టు నిర్మాణం
- పార్వతీపురం, పాలకొండలోనూ నిర్మాణానికి సన్నాహాలు
- తాగునీటి సరఫరాకు సమగ్రప్రణాళిక



సాలూరులో సమగ్రతాగునీటి అభివృద్ధి పథకానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం (ఫైల్)

సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలకు శుభవార్త. మరికొద్ది నెలల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఇంటింటికీ సమృద్ధిగా తాగునీరు సరఫరా కానుంది. ప్రజాసంకల్పయాత్రలో ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మన్యం ప్రజల తాగునీటి సమస్యను గుర్తించారు. అధికారులతో సమగ్ర ప్రణాళికను రూపొందించారు. అందులో భాగంగా తొలివిడతగా సాలూరులో తాగునీటి పథకం నిర్మాణానికి రూ.68.98కోట్లు కేటాయించారు. ప్రస్తుతం సాలూరు గాంధీ పార్కువద్ద ట్యాంకు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పైపులైన్లు వేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. పాలకొండ, పార్వతీపురం పట్టణాల్లో కూడా తాగునీటి పథకాల నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

పథక నిర్మాణం ఇలా...

సాలూరు మున్సిపాలిటీలో సమగ్ర తాగునీటి అభివృద్ధి పథకం పనులకు ఇటీవల డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర శంకుస్థాపన చేశారు. రూ.68.98 కోట్ల అంచనా వ్యయంతో 70 లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మాణం పనులను అధికారులు ప్రారంభించారు. పాచిపెంట మండలం పెద్దగెడ్డ రిజర్వాయర్ నుంచి ట్యాంకుకు నీటిని పంప్ చేస్తారు. ఇక్కడ శుద్ధిచేసిన నీటిని మున్సిపల్ ప్రజలకు సరఫరా చేస్తారు. ప్రస్తుతం సాలూరు జనాభా 52 వేలు కాగా భవిష్యత్‌లో 75 వేల మందికి సమృద్ధిగా తాగునీరు సరఫరా చేసేలా ట్యాంకును నిర్మిస్తున్నారు. ప్రస్తుత తలసరి నీటి సరఫరా 64 లీటర్లు (ఒక రోజుకు) కాగా, ప్రాజెక్టు పూర్తయిన తరువాత తలసరి నీటి సరఫరా 135 లీటర్లు (ఒక రోజుకు)గా అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో ఉన్న 3,372 కుళాయిల సంఖ్య 8,500కు పెరగనుంది. మున్సిపాలిటీలో గాంధీ పార్క్ వద్ద 8 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ట్యాంకు, కె.బొడ్డవలస వద్ద 5 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌లు నిర్మించనున్నారు. మొదటగా గాంధీ పార్క్ వద్ద పనులు ప్రారంభమయ్యాయి.

- పార్వతీపురంలో రూ.63.63కోట్ల వ్యయంతో 120లక్షల లీటర్ల సామర్థ్యంతో సమగ్రతాగునీటి పథకాన్ని నిర్మించాలని నిర్ణయించారు. పట్టణంలోని 12వేల కుటుంబాలకు ఇంటింటికీ కుళాయిలద్వారా తాగునీరు సరఫరాచేయనున్నారు. తోటపల్లి ప్రాజెక్టు నుంచి పథకానికి నీటిని పంప్‌చేస్తారు.
- పాలకొండలో రూ.57కోట్ల వ్యయంతో నిర్మించనున్న నాలుగు తాగునీటి ట్యాంకులకు నాగావళి నది నుంచి నీటిని పంప్‌చేస్తారు. అక్కడి నుంచి పాలకొండ పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేయనున్నారు. నాగావళి నుంచి నీటి మళ్లింపుకు 32 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేయనున్నారు. ఉచితంగానే సరఫరా తాగునీటిని పూర్తిగా ఉచితంగానే సరఫరా చేయనున్నారు. ఒక్క రూపాయి చెల్లించకుండానే ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నారు. ఎనిమిదేళ్లపాటు ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతను పూర్తిగా నిర్మాణదారులకే ప్రభుత్వం అప్పగించింది. ఏఐఐబీ నిధులతో పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎమ్/ఎస్ యస్.సి.సి.లిమిటెడ్, ఎమ్/ఎస్ వెల్కోఅండ్ స్టాండర్డ్(హైదరాబాద్) కంపెనీలు ట్యాంకు పనులు చేపట్టాయి.



సాలూరు గాంధీపార్కువద్ద ప్రారంభమైన తాగునీటి ట్యాంకు పనులు

ఆనందంగా ఉంది



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చొరవతో సాలూరులో వందేళ్ల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కలగనుంది. సాలూరులో పనులు ప్రారంభమయ్యాయి. పాలకొండ, పార్వతీపురంనూ త్వరలో పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ తాగునీటి కుళాయిల పనులు చురుగ్గా సాగుతున్నాయి. మాది చేతల ప్రభుత్వం. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

– పీడిక రాజన్నదొర, డిప్యూటీసీఎం

23న స్పెషల్ బీఈడీ స్పాట్ అడ్మిషన్లు

పార్వతీపురం: డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్, లా అండ్ ఎడ్యుకేషన్ కళాశాలలో రెండేళ్ల స్పెషల్ బీఈడీ కోర్సులో మిగుల సీట్ల భర్తీకి ఈనెల 23న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు రిజిస్ట్రార్ ప్రొ.రాజేంద్రప్రసాద్ మగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ సెట్ రాసిన అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ఖాళీ పోస్టుల భర్తీకి వివాహిత మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి కె.విజయగౌరి మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ నెల 28 తేదీ సాయంత్రం 5 గంటలలోగా కార్యాలయ పనిదినాల్లో సంబంధిత ఐసీడీఎస్ పీఓ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

పోస్టుల ఖాళీలు ఇలా..

- పార్వతీపురం మున్సిపాలిటీలో ఒక సహాయకురాలు, మండలంలో అంగన్‌వాడీ కార్యకర్త-1, సహాయకులు-6, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు-2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- పాచిపెంటలో సహాయకులు-4, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు-3
- పాలకొండ మున్సిపాలిటీలో అంగన్‌వాడీ కార్యకర్త-1, సహాయకులు-2
- సీతంపేట ప్రాజెక్టులో మిని అంగన్‌వాడీ కార్యకర్తలు-2, వీరఘట్టంలో సహాయకులు-2 పోస్టులు
- బొబ్బిలి, బలిజిపేట మండలాల్లో సహాయకుల పోస్టులు-2 ఖాళీగా ఉన్నాయి.

పేద ప్రజలకు ఉగాది కానుక

- సాలూరు పట్టణంలో 512 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు
- లాటరీ పద్ధతిలో కేటాయింపు



ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లు

సాలూరు: పేద ప్రజలకు ఉగాది కానుకగా ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది. నెలిపర్తి సమీపంలో నూతనంగా కొనుగోలు చేసిన 10.5 ఎకరాల విస్తీర్ణంలో వేసిన వైఎస్సార్‌జగనన్న లే అవుట్‌లో 512 మందికి లాటరీ పద్ధతిలో ఇళ్ల స్థలాలను కేటాయించింది. ఈ బృహత్తర కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు భాగస్వాములయ్యారు. డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర సూచనల మేరకు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం రాత్రి సాలూరు పట్టణానికి చెందిన 491 మందికి, జీగిరాంకు చెందిన 21 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. స్థలాలు పొందిన లబ్ధిదారులందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ సీఎం చేతుల మీదుగా త్వరలోనే పేదలకు పట్టాలు పంపిణీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ శంకరరావు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, రెవెన్యూ, హౌసింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గల గిరిజన గురుకులంలో ఖాళీగా ఉన్న 20 టీచర్ ఉద్యోగాలను 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీచేసేందుకుగాను డిగ్రీ, పీజీ కోర్సుల్లో ఉత్తీర్ణులై, టెట్ అర్హత ఉన్న ఇంగ్లీష్ మీడియం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులనుంచి ఈనెల 28 సాయంత్రం 5 గంటలలోగా గురుకులం సెల్, ఐటీడీఏలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 31 నుంచి ఏప్రిల్ 1వ తేదీవరకు స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, జోగింపేటలో డెమో నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలనుంచి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని స్పష్టం చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



పేకాటరాయుళ్లతో ఎస్సై రాజేష్ సిబ్బంది

వేపాడ: మండలంలోని బొద్దాం సమీపంలో మంగళవారం సాయంత్రం వల్లంపూడి పోలీసులు నిర్వహించిన దాడుల్లో పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించిన దాడుల్లో ఆరుగురు పేకాట రాయుళ్లు పట్టుబడటంతో అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.17,800 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

స్థల వివాదం

డెంకాడ: మండల కేంద్రమైన డెంకాడ గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న భూమి విషయంలో వివాదం రేగింది. ఆ భూమికి కొందరు కంచె వేయాలని ప్రయత్నించారు. అయితే అది ప్రభుత్వ భూమి అని, ఆ ప్రాంతంలో బోరు, నూకాలమ్మతల్లి గుడి, బావి వంటివి ఉన్నాయని స్థానికులు, గ్రామపెద్దలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వీఆర్వో రామారావు ఆ స్థలాన్ని పరిశీలించి కంచె ఏర్పాటు పనులను అడ్డుకున్నారు. గ్రామస్తుల ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

మొబైల్ చోరీ నిందితుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని అడ్డగించి అతని మొబైల్‌ను లాక్కుని పరారైన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ ఏఎస్సై వై.పడితల్లి మంగళవారం తెలిపారు. ఈ నెల 20న బైక్‌పై వైఎస్సార్ నగర్ వెళ్తున్న ఆకి ప్రసాదరావును పప్పుల మిల్లు వద్ద ఇద్దరు యువకులు ఆపి అతని జేబులో ఉన్న మొబైల్ ఫోన్‌ను తీసుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు కుమ్మరవీధి జంక్షన్ వద్ద మంగళవారం ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి మొబైల్ ఫోన్‌తో పాటు పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు.

దగ్గు, జ్వరాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

సాలూరు: రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం క్షయ కావచ్చని టీబీ సూపర్‌వైజర్ నరేష్ అన్నారు. క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని నేరెళ్లవలస వారపుసంతలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బరువు తగ్గడం, ఆకలి మందగించడం, దగ్గేటప్పుడు కఫం ద్వారా రక్తపు జీరలు పడడం వంటివి క్షయ వ్యాధి లక్షణాలుగా గుర్తించాలన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా మందులు వాడటం, జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా జయించవచ్చన్నారు.

మహిళలకు అండగా సమాఖ్య

విజయనగరం పూల్‌బాగ్: పీడిత మహిళలకు అండగా మహిళా సమాఖ్య పోరాడుతుందని రాష్ట్ర మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత పావని అన్నారు. స్థానిక అమర్‌భవన్‌లో మంగళవారం మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షురాలు ఎం.మాణిక్యం, జిల్లా అధ్యక్షురాలు బాయి రమణమ్మ, ఉపాధ్యక్షురాలు షేక్‌చాంద్‌బీబీ, ఉంగరాల జయలక్ష్మి, లెంక వరలక్ష్మి పాల్గొన్నారు.

తెలుగు పండితులకు సత్కారం

విజయనగరం: పట్టణంలోని వనిత వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక మహారాజ లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో జరిగిన ఈ వేడుకల్లో వాకర్స్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి పాల్గొని మాట్లాడారు. హిందూ సంప్రదాయాలు, తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలుగు భాషా పండితులు సీహెచ్.పార్వతి, దశ గ్రంథాల వెంకటసుబ్రహ్మణ్యం, సరిపల్లి సోమేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ పూర్వపు గవర్నర్, సీనియర్ న్యాయవాది ఫోరెస్ రాజు, క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్.సాయిసంతోషిణి, తదితరులు పాల్గొన్నారు.

జలమే జీవనాధారం

- నీటిని పొదుపుగా వాడాలి
- నేడు ప్రపంచ జల దినోత్సవం



రాజాం: సంతకవిటిలో నేలబావిలో నీరు



రాజాం: రాజాం సమీపంలో నిండుకుండలా సాగునీటి చెరువు

రాజాం/విజయనగరం ఫోర్ట్: సమస్త ప్రాణికోటికి జలమే జీవనాధారం. అటువంటి జలవనరును పొదుపుగా వినియోగించుకోవల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉంది. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో నీటి సమస్యలు ఉండగా, విజయనగరం జిల్లాలో మాత్రం ప్రాజెక్టులు, నదులు ఎక్కువగా ఉండడంతో భూగర్భ జలాల సమస్య పెద్దగా లేదు. గతంలో పోల్చుకుంటే ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాలు తగ్గుముఖం పట్టినప్పటికీ సేఫ్‌జోన్‌లోనే వాటర్‌లెవెల్స్ కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వేసవి ఆరంభం కావడంతో చాలా ప్రాంతాల్లో సాగునీటి వనరులు అడుగంటుతున్నాయి. చెరువులు, బావుల్లో నీరు కిందికి దిగుతోంది. జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాలు చేతికందేలా ఉన్నప్పటికీ రక్షణ చర్యలు చేపట్టకుంటే భవిష్యత్‌లో ఇబ్బంది వచ్చే పరిస్థితి కనిపిస్తుంది. నేడు వరల్డ్ వాటర్ డే సందర్భంగా జిల్లాలో భూగర్భ జలాలపై ప్రత్యేక కథనం.

ఆ ప్రాంతాలు మినహా..

జిల్లా వ్యాప్తంగా 4.96 మీటర్ల సరాసరిలో లెవెల్‌లో భూగర్భజలాలు ఉన్నాయి. ప్రధానంగా చీపురుపల్లి మండలం పరిధిలో 10 మీటర్లు, గరవిడిలో ప్రమాదకరంగా 12 మీటర్లు దాటి భూగర్భజలాలు అడుగంటాయి. 3 నుంచి 8 మీటర్ల లో లెవెల్‌లో వాటర్ లెవెల్స్ ఉండాలి. అంతకంటే లోపటికి నీరు వెళ్తే జలాలు అడుగంటుతాయని విశ్లేషకుల అభిప్రాయం. మెరకముడిదాం, వంగర మండలాల్లో 8 మీటర్ల అంచున లో లెవెల్స్‌లో భూగర్భ జలాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో పంట పొలాలు అధికంగా సాగులో ఉండడంతో పాటు ఫ్యాక్టరీలు ఉండడం, భూగర్భజలాల కోసం అధికంగా నేలబావులు, బోరుబావులు వినియోగించడం ప్రధాన కారణంగా తెలుస్తుంది.

ఈ ఏడాది 3 మీటర్ల వ్యత్యాసం

గడిచిన నాలుగేళ్లలో ఫిబ్రవరి నెలలో జిల్లాలో భూగర్భజలాల సరాసరి లెవెల్స్‌ను పరిగణనలోకి తీసుకుంటే ఈ ఏడాది 3 మీటర్ల మేర జలాలు కిందికి దిగాయి. గత ఏడాది ఫిబ్రవరిలో జిల్లా వ్యాప్తంగా 1.83 మీటర్ల లోతులో నీరు ఉండగా, ఈ ఏడాది 4.96 మీటర్ల లోతులోకి నీరు ఇంకింది. వేసవి ఆరంభంలో ఇలా ఉండగా, వేసవి తీవ్రంగా ఉంటే ఈ లెవెల్స్ పడిపోయే పరిస్థితి ఉందని జిల్లా భూ గర్భ జలశాఖ జిల్లా అధికారులు పేర్కొంటున్నారు. బాడంగి, గజపతినగరం, గరివిడి, మెరకముడిదాం, ఎస్,కోట, తెర్లాం మండలాల్లో గత ఏడాది కంటే ఈ ఏడాది భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. ఈప్రాంతాల్లో నీటి వినియోగం పెరిగింది. నెల్లిమర్ల, సంతకవిటి, పూసపాటిరేగ తదితర ప్రాంతాల్లో వాటర్‌లెవెల్స్ గత ఏడాది కంటే పెరిగాయి. ఈ ప్రాంతాల్లో భూగర్భజలాల వినియోగం గతంలో కంటే తగ్గింది.

రెండుమీటర్ల లోతులోనే..

ఇదిలా ఉండగా జిల్లాలో విజయనగరం, సంతకవిటి, రేగిడి, గుర్ల, జామి, పూసపాటిరేగ, నెల్లిమర్ల, రాజాం, రామభద్రపురం, కొత్తవలస, గంట్యాడ తదితర ప్రాంతాల్లో రెండు నుంచి మూడు మీటర్లు లోతులోనే భూగర్భజలాలు ఉన్నాయి. వేసవిలో ఈ నీటి వనరులు ఇంత ఎత్తులో ఉండడంతో వర్షాకాలంలో అవి మరింత మీదకు వచ్చే అవకాశం ఉంది. ఈప్రాంతాల్లో ఇలా బోర్లు వేయగానే నీరు వచ్చిపడుతుంది.



విజయనగరం ఫోర్ట్: జలజీవన్ మిషన్ ద్వారా ఇంటి వద్ద వేసిన కుళాయి

తాగునీటి పథకాల వివరాలు

జిల్లాలో 27 మండలాల్లో 779 గ్రామ పంచాయతీలు, 1,621 మధుర గ్రామాలు ఉన్నాయి. వాటి పరిధిలో సీపీడబ్ల్యూ స్కీమ్‌లు 938 గ్రామాలకు తాగునీరు అందించేవి 30 ఉన్నాయి. పీడబ్ల్యూ స్కీమ్స్ 965 ఉన్నాయి. ఎంపీడబ్ల్యూ స్కీమ్స్ 184 ఉన్నాయి. నేరుగా తాగునీరు అందించే పథకాలు 408 ఉన్నాయి. బోర్లు 14,080 ఉన్నాయి. వాటి ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. గతంలో 40 నుంచి 50 ఇళ్లకు ఒక కుళాయి ఉండేది. కానీ ప్రస్తుతం ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా నీటిని అందిస్తున్నారు.

నీటి లభ్యతను పెంచాలి



జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి నీటిని అందజేస్తున్నాం. నీటి లభ్యతను పెంచేవిధంగా ప్రతి ఒక్కరూ చర్యలు చేపట్టాలి.

– బి. ఉమాశంకర్, ఎస్‌ఈ ఆర్‌డబ్ల్యూఎస్

గత నాలుగేళ్లలో జిల్లాలో భూగర్భజలాల సరాసరి

సంవత్సరం - భూగర్భ జలాల సరాసరి

2020(ఫిబ్రవరి) – 2.763 మీటర్లు లెవెల్
2021(ఫిబ్రవరి) – 3.51 మీటర్లు లెవెల్
2022(ఫిబ్రవరి) – 1.83 మీటర్లు లెవెల్
2023(ఫిబ్రవరి) – 4.96 మీటర్లు లెవెల్

టీడీపీవి తాత్కాలిక సంబరాలే

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

బొబ్బిలి/రామభద్రపురం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొద్దిపాటి విజయంతో తాత్కాలిక సంబరాలు చేసుకున్న టీడీపీ నాయకులు గతంలో ఏం చేశామో? భవిష్యత్తులో ఏం చేస్తామో కూడా చెప్పలేని దీనస్థితిలో ఉన్నారని, మళ్లీ దోచుకోవడం–దాచుకోవడం కోసం అర్రులు చాస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసం రావు ఎద్దేవా చేశారు. ప్రజలు అధికారం ఇచ్చిన 15 సంవత్సరాలు ఏం చేయలేని ప్రతిపక్ష నాయకులు ఇప్పుడు అర్జంటుగా అధికారంలోకి వచ్చేయాలని తాపత్రయ పడుతున్నారని, ఇప్పుడొచ్చి ఏం చేస్తారని ప్రశ్నించారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాగిజావ పంపిణీ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలలో నాడు –నేడు పథకంలో దాదాపు రూ.35వేల కోట్లకు పైగా ఖర్చు చేసి విద్యారంగ దశదిశను సమూలంగా మార్చేశారన్నారు. విద్యార్థులకు ఏం కావాలో అవి అందజేస్తున్నారన్నారు. మరో రెండేళ్లలో కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలను, కళాశాలలుగా తీర్చిదిద్దుతామని సీఎం చెప్పారన్నారు. వైఎస్సార్‌సీపీ ఓట్ల కోసం చేస్తున్న కార్యక్రమాలు ఇవేవీ కావని, అలాగే అయితే ఎన్నికల ముందే ఈ కార్యక్రమాలన్నీ చేసుండేవారమన్నారు. విద్యార్థులు, ప్రజలకు ఏం చేయాలనే ఆలోచనలోనే ముఖ్యమంత్రి ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయని ప్రజలే చెబుతున్నారన్నారు. అధికారం కోసం కలలు కంటున్న ప్రతిపక్ష నాయకులకు మరోసారి చెబుతున్నామని, 2024లో రానున్న ఎన్నికల్లో జిల్లాలోని 9 అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని స్పష్టం చేశారు.

మరింత సులువుగా వైద్యసేవలు

- ఆరోగ్యశ్రీ మేనేజర్ డి.రాంబాబు

పార్వతీపురంటౌన్: ఆరోగ్యశ్రీలో మరింత సులువుగా వైద్యసేవలు పొందేలా చర్యలు చేపట్టామని పార్వతీపురం మన్యం జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్ డి. రాంబాబు అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులను పరిశీలించి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో సక్రమంగా వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నడుపుతున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్సపొందిన అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న రోగికి వైద్య ఆసరా పథకం ద్వారా నగదు బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నారని తెలిపారు. వైద్య ఆసరా పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బ్యాంకు అకౌంట్ల వివరాలను ఆస్పత్రుల వద్ద ఉన్న ఆరోగ్యమిత్రలకు అందజేసి నగదును ఖాతాల్లో పొందవచ్చన్నారు. ఎవరికైనా నగదు అందనట్‌లెతై తక్షణమే ఆరోగ్యమిత్రలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్రలు ఉదయ్‌కిరణ్, వెంకటరమణ, సింహాచలం, శారద, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ డి. రాంబాబు

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

11టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత

వంగర: మండల పరిధి లక్ష్మీపేట గ్రామంలో 11 టన్నుల 60 కేజీల పీడీఎస్ బియాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారం మేరకు మంగళవారం విజిలెన్స్ సీఐ అప్పలనాయుడు సమక్షంలో సివిల్ సప్లయిస్ డీటీ బలివాడ గోవిందరావు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన ఎ.చిన్నంనాయుడు ఓ ఇంట్లో నిల్వ చేసిన 11 టన్నుల 60 కేజీల పీడీఎస్ బియ్యాన్ని అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యాన్ని స్థానిక వీఆర్వోలు కృష్ణ, బలరామ్‌లకు అప్పగించినట్లు డీటీ గోవిందరావు వెల్లడించారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹ 180

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని చిన్నాన్న, మామయ్యలకు అప్పగించిన పోలీసులు

దత్తిరాజేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం గుమ్మకోట నుంచి తప్పిపోయి వచ్చిన బాలుడిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పెదమానాపురం ఎస్సై బి.భాగ్యం మంగళవారం తెలిపారు. పెదమానాపురం సంతతోట నుంచి రైల్వేగేట్ వైపు నడుచుకుంటూ వస్తున్న 10 సంవత్సరాల వయస్సున్న పొంగి ప్రసాద్ ఏడుస్తుండంతో గమనించిన స్థానికులు ఓదార్చి పోలీసులకు సమాచారం అందించారు. తల్లి మృతి చెందగా తండ్రి ఎక్కడున్నాడో తెలియదని బాలుడు చెప్పిన వివరాలు సేకరించిన పోలీసులు బాలుడి చిన్నాన్న పొంగి సింహాచలం, మామయ్య కంబడి త్రినాథలకు సమాచారం అందించారు. వారు మంగళవారం సాయంత్రం స్టేషన్‌కు రావడంతో బాలుడిని అప్పగించారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



సేనాపతి గణేష్ (ఫైల్)

కొత్తవలస: మండల కేంద్రంలోని విజయనగరం రోడ్డులో గల పీఎంఎల్ కాంప్లెక్స్ సమీపంలో మంగళవారం భారీ లారీ ఢీకొని కంటకాపల్లి గ్రామానికి చెందిన సేనాపతి గణేష్ (35) దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంపై స్థానికులు, పోలీసులు అందించిన వివరాలి లా ఉన్నాయి. గణేష్ స్వగ్రామం నుంచి ద్విచక్రవానంపై కొత్తవలస వస్తుండగా వెనుక నుంచి వస్తున్న భారీ లారీ ఢీకొట్టింది. దీంతో హెల్మెట్ తూలిపోయి గణేష్ రోడ్డుపై పడిపోగా లారీ వెనుక చక్రాలు తలపై నుంచి వెళ్లిపోయాయి. దీంతో తీవ్ర గాయాల పాలై రక్తస్రావం అధికంగా జరగడంతో గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు గణేష్‌కు భార్య హేమలత 4సంవత్సరాలు,ఒక సంవత్సరం వయస్సుగల బాబు, పాప ఉన్నారు. ఏసీ రిపేర్ పనులు చేస్తు గణేష్ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సమాచారం మేరకు ఘటనా స్థలానికి ఎస్సై బొడ్డు దేవి, ఏఎస్సై పి.రాజులు చేరుకుని శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

మరో ప్రమాదంలో ఆటో డ్రైవర్..

డెంకాడ: మండలంలోని మోదవలస గ్రామం వద్ద ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటోడ్రైవర్ నవిరి వెంకటరమణ(24) మరణించినట్లు హెచ్‌సీ సురేష్ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో విశాఖ నుంచి విజయనగరం వస్తున్న ఆటో ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ రమణ మరణించాడు. డెంకాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీటింగ్ కేసుల్లో ప్రణాళికాబద్ధంగా దర్యాప్తు

- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక




విజయనగరం క్రైమ్: దర్యాప్తులో ఉన్న చీటింగ్ కేసులను ప్రత్యేకంగా సమీక్షించి, చీటింగ్ కేసుల్లో దర్యాప్తును ప్రణాళికాబద్ధంగా, త్వరితగతిన పూర్తిచేయాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సివిల్ తగాదాలపై వచ్చిన ఫిర్యాదుల్లో డాక్యుమెంట్లను పరిశీలించి, రెవెన్యూ అధికారుల సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. నాన్‌బెయిలబుల్ వారంట్లు న్యాయస్థానాల నుంచి వచ్చిన తక్షణమే ఎగ్జిక్యూట్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

రహదారి భద్రతకు ప్రాధాన్యం

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపైన, మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపైనా కఠినంగా వ్యవహరించి, కేసులు నమోదుచేయాలని చెప్పారు. రహదారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలు, వాహనదారులకు హెల్మెట్ ధారణ, రహదారి భద్రత పట్ల అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్, విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ బి.మోహనరావు, దిశ మహిళా పీఎస్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు, న్యాయ సలహాదారులు వై.పరశురాం, డీపీఓ ఏఓ వెంకటరమణ, సీఐలు, హెచ్‌సీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు

జిల్లా పోలీసుశాఖ విధులను సమర్థవంతంగా నిర్వహించి, దొంగతనం కేసులను ఛేదించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ మేరకు వారికి ప్రశంసపత్రాలను, జ్ఞాపికలను అందజేశారు.



హాజరైన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది

వైద్య సిబ్బంది పర్యవేక్షణ పెరగాలి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

విజయనగరం అర్బన్: గర్భిణులు, శిశువుల ఆరోగ్యంపై వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణ మరింత పెరగాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఎండీఎస్ఆర్, సీడీఆర్ జిల్లా కమిటీ సమావేశంలో మాతా శిశు మరణాలపై డెత్ ఆడిట్ నిర్వహించారు. జిల్లాలో సంభవించిన శిశు, మాతృమరణాలపై సంబంధిత వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లను ప్రశ్నించారు. మరణానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషకాహారం, గర్భం దాల్చడం, ప్రసవం, శిశువుల పెంపకంపై మహిళలకు మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. దీనికోసం సహేలి గ్రూపులు దోహదపడతాయని పేర్కొన్నారు. కొత్తగా వివాహమైన స్త్రీలతో సహేలీ గ్రూపులను ఏర్పాటు చేసి, వివిధ అంశాలపట్ల అవగాహన కల్పించాలని చెప్పారు. గర్భం దాల్చిన దగ్గర నుంచి, ప్రసవించే వరకు నిత్యం తల్లీబిడ్డల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేశారు. తల్లికి సంపూర్ణ అవగాహన కల్పించడంతోపాటు, వైద్య సిబ్బంది సరైన పర్యవేక్షణ ఉంటే కొన్ని మరణాలనైనా అడ్డుకోవచ్చని అభిప్రాయ పడ్డారు.

ఆస్పత్రుల మరమ్మతులు పూర్తి చేయాలి

జిల్లాలో నాడు నేడు పథకం కింద చేపట్టిన ఆస్పత్రి భవనాల మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆస్పత్రుల వారీగా జరిగిన పనులపై సమీక్షించారు. చాలా చోట్ల పనులు పెండింగ్‌లో ఉండడంపై అధికారులను ప్రశ్నించారు. ప్రతి భవనాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రమణకుమారి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, ఆర్అండ్‌బీ ఎస్ఈ విజయశ్రీ, వైద్యాధికారులు, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

తెలగలను బీసీల్లో చేర్చాలి

విజయనగరం పూల్‌బాగ్: ఉత్తరాంధ్ర జిల్లాల్లోని తెలగ కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలని తెలగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల్ల ప్రసాదరావు కోరారు. స్థానిక ఉడాకాలనీలోని సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలగ కులస్తుల రిజర్వేషన్‌పై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. మంజునాథ్ కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి.నరసింగరావు, ఉంగరాల అప్పలరాజు, జి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.